నమస్తే తెలంగాణ
సూర్యాపేట
I | నల్లగొండ, శుక్రవారం 25 ఏప్రిల్ 2025 | SURYAPET

జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

- ప్రధాన న్యాయమూర్తి ఎ.జయరాజు

భువనగిరి అర్బన్, ఏప్రిల్ 24 : జూన్ 9 నుంచి 14 వరకు నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ అధ్యక్షుడు, జిల్లా ప్రధాన న్యాయ మూర్తి ఏ జయరాజు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. జూన్ 14వ తేదీ వరకు చెక్ బౌన్స్ కేసుల పరిష్కారానికి ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వ హించబడుతుందని, జిల్లా వ్యాప్తంగా 691 చెక్ బౌన్స్ పెండింగ్ కేసులను గుర్తించినట్లు చెప్పారు. ఈ కేసుల్లో నోటీసులు కూడా జారీ చేసే ప్రక్రియ ప్రారంభమైనట్లు తెలిపారు. బ్యాంక్ అధికారులతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి కేసుల పరిష్కా రానికి తీసుకునే చర్యలపై సూచనలు చేసినట్లు చెప్పారు. చెక్ బౌన్స్ కేసుల్లో ఇరు పక్షాలు ఈ ప్రత్యేక లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకో వాలని సూచించారు. ప్రత్యేక కౌన్సిలింగ్ కోసం మే 5 నుంచి 19వరకు ప్రీ సిట్టింగులు నిర్వహించను న్నట్లు తెలిపారు. ఈ సిట్టింగుల్లో లోక్ అదాలత్ సభ్యులు, మీడియేషన్ న్యాయవాదులకు కౌన్సె లింగ్ నిర్వహించడానికి జిల్లాలోని భువనగిరి, రామన్నపేట, ఆలేరు, చౌటుప్పల్, యాదాద్రి కోర్టుల న్యాయమూర్తులకు తగిన సూచనలు చేసి నట్లు పేర్కొన్నారు.

అవినీతి కోట

- అర్హత లేని డాక్టర్లు, స్కానింగ్ సెంటర్లకు అనుమతులు
- రోగుల ప్రాణాలతో చెలగాటం
- తెలంగాణ మెడికల్ కౌన్సిల్ తనిఖీల్లో వెలుగులోకి..
- రూ.లక్షల్లో అవినీతి... ఏటా అనుమతులపై అనుమానాలు
- మామూళ్లు ముట్టజెప్తే కాని పనిలేదంటూ ఇప్పటికే విమర్శలు

సూర్యాపేట జిల్లా వైద్యారోగ్య శాఖలో విచ్చలవిడిగా అక్రమాలు

సూర్యాపేట, ఏప్రిల్ 24 (నమస్తే తెలంగాణ) : జిల్లా వైద్యారోగ్య శాఖకు అవినీతి జబ్బు పట్టింది. ఇక్కడ సస్పెండ్ అయిన ఉద్యోగికి సగం జీతం ఇవ్వాలంటే లక్ష రూపాయలు ముట్టజెప్పాల్సిందే. ప్రసూతి సెలవులు కావాలన్నా, మెడికల్ లీవ్‌లో ఉన్నా వేతనాల్లో కోతలు సహజమే! ఇవన్నీ ఇటీవల వెలుగు చూసిన ఘటనలే. తాజాగా సూర్యాపేట జిల్లా కేంద్రంలో అర్హత లేని డాక్టర్లు నడుపుతున్న ప్రైవేట్ దవాఖానలు, స్కానింగ్ సెంటర్లు తెలంగాణ మెడికల్ కౌన్సిల్ ఆకస్మిక తనిఖీల్లో వెలుగు చూశాయి. సూర్యాపేట జిల్లావ్యాప్తంగా ఇలాంటివి వందకు పైనే ఉన్నట్లు ఐఎంఏ సభ్యులు చెప్తున్నారు. జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారులు వాటికి అనుమతులు ఎలా ఇచ్చారు? ఎలా రెన్యూవల్ చేస్తున్నారు అనేది అనేక విమర్శలకు తావిస్తున్నది. కొనేండ్లుగా నడుస్తున్న ఈ తతంగంలో లక్షల రూపాయల అవినీతి జరుగుతున్నదని, నెలనెలా ముడుపులు ముడుతున్నాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

సూర్యాపేట జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో జరుగుతున్న అవినీతి లీలలు అన్నీ ఇన్నీ కావు. మామూళ్లు ముట్టజెప్తే చాలు నిబంధనలకు విరుద్ధంగా ఎలాంటి అనుమతులైనా ఇస్తున్నారనే విమర్శలున్నాయి. డాక్టర్లు లేని ఆసుపత్రులు, డయాగ్నస్టిక్ సెంటర్ల నుంచి నెలనెలా వసూళ్లు చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అర్హత లేని డాక్టర్లు కొందరు ఆర్ఎంపీలకు కమీషన్ ఎర చూపి పేషెంట్లను చికిత్స పేరుతో పీల్చిపిప్పి చేయడం, సరైన వైద్యం అందని కారణంగా రోగులు చనిపోవడం వంటి ఘటనలు చాలానే ఉన్నాయి. ఇంత జరుగుతున్నా వైద్యారోగ్య శాఖ అధికారులు తీసుకునే చర్యలు మాత్రం ఏమీ ఉండవు. కారణం.. మామూళ్ల మత్తేనన్నది సంబంధిత వర్గాల ద్వారా తెలుస్తున్నది. ప్రైవేట్ ఆసుపత్రులు, డయాగ్నస్టిక్ సెంటర్లు, స్కానింగ్ సెంటర్ల తనిఖీల సమయంలో హడావిడి చేయడం, కొన్నింటిని సీజ్ చేస్తున్నట్లు ప్రకటించడం చేసినా.. ఆ తర్వాత అవే యాజమాన్యాలు తిరిగి ప్రారంభించడం గమనార్హం. అప్పటి వరకు న్న ఆసుపత్రి పేరుకు ముందో, వెనుకో చిన్న తోక తగిలించి తిరిగి వైద్యాన్ని అక్రమ వ్యాపారంగా దర్జాగా సాగిస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఇలాంటి వన్నీ స్థానికంగా తీవ్ర విమర్శలకు తావిస్తున్నా ఖాతరు చేయడం లేదు. నిబంధనలకు విరుద్ధంగా దవాఖానలు, స్కానింగ్ సెంటర్లు నిర్వహించడం, అర్హత లేని వైద్యుల వ్యవహారంపై వారం క్రితం సూర్యాపేట ఐఎంఏ సభ్యులు రంగంలోకి దిగి బహిరంగంగా హెచ్చరికలు చేశారు. అయినా అధికారులు పట్టించుకోకపోవడంతో తెలంగాణ మెడికల్ కౌన్సిల్‌కు ఫిర్యాదు చేశారు. దాంతో మెడికల్ కౌన్సిల్ సభ్యులు గురువారం సూర్యాపేట పట్టణంలో ఆకస్మిక తనిఖీలు చేపట్టగా విస్తుపోయే వాస్తవాలు వెలుగుచూశాయి.

సూర్యాపేటలోని సాయిగణేశ్ దవాఖానలో తనిఖీ చేస్తున్న మెడికల్ కౌన్సిల్ సభ్యులు

అర్హత లేని డాక్టర్లు, విచ్చలవిడిగా స్కానింగ్ సెంటర్లు

మెడికల్ కౌన్సిల్ సభ్యుల తనిఖీల్లో అర్హత లేని డాక్టర్లు రోగులకు వైద్యం అందిస్తున్నట్లు, స్కానింగ్ సెంటర్లు నడుపుతున్నట్లు వెలుగులోకి వచ్చింది. వాస్తవానికి చైనా, రష్యా, ఉక్రెయిన్ వంటి దేశాల్లో మెడిసిన్ చదివిన వారు ఇండియాలో వైద్యం అందించాలంటే క్వాలిఫైడ్ పరీక్ష రాయాల్సి ఉంటుంది. అలాంటివి రాయకుండా నేరుగా ఆయా దేశాల్లో చదివిన కోర్సులను పెట్టుకుని ఎండీ, జనరల్ ఫిజిషియన్ అంటూ బోర్డులు తగిలించుకుని వైద్యం చేస్తున్నారు. తనిఖీలు చేసిన సమయంలో సూర్యాపేటలోని యాపిల్ స్కానింగ్ సెంటర్‌లో క్వాలిఫైడ్ కాని డాక్టర్ స్కానింగ్ చేస్తుండడం గుర్తించారు. సాయిగణేశ్ ఆసుపత్రిలో అర్హత లేని డాక్టర్ వైద్యం చేస్తుండడం బహిర్గతమైంది. శ్రీకృష్ణ ఆసుపత్రిలో బయటకు చెప్తున్న డాక్టర్లు ఎవరూ లేరు. స్థానికంగా ఉన్న అర్హత లేని వైద్యులను కాంట్రాక్ట్ పద్ధతిలో తీసుకువచ్చి దవాఖాన నడపుతున్నట్లు తేలింది. తనిఖీల్లో తెలంగాణ మెడికల్ కౌన్సిల్ సభ్యులు డాక్టర్ నరేశ్‌కుమార్, డాక్టర్ రాజీవ్, డాక్టర్ అరుంధతి ఉన్నారు. నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు పొందిన ఆసుపత్రులు, స్కానింగ్ సెంటర్లతోపాటు అర్హత లేని డాక్టర్లపై మెడికల్ కౌన్సిల్ మెంబర్లు కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్‌కు వివరించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

సూర్యాపేటలోని యాపిల్ స్కాన్ సెంటర్‌కు వివారణ కోసం వచ్చిన మెడికల్ కౌన్సిల్ సభ్యులు

అక్రమాలు వాస్తవమే

-డాక్టర్ నరేశ్‌కుమార్, తెలంగాణ మెడికల్ కౌన్సిల్ సభ్యుడు

'ఈ నెల 17న ఒకసారి, గురువారం మరొకసారి సూర్యాపేట జిల్లా కేంద్రంలోని పలు ఆసుపత్రులు, స్కానింగ్ సెంటర్లలో ఆకస్మిక తనిఖీలు చేశాం. ఎక్కడైనా ఆసుపత్రికి అనుమతి కావాలంటే 2022 క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ ప్రకారం ఐదుగురు సభ్యులతో కూడిన కమిటీ ఆమోదం తెలుపుతుంది. చివరకు డీఎంహెచ్ఓ అనుమతులు ఇస్తారు. తెలంగాణ మెడికల్ కౌన్సిల్ సర్టిఫికెట్ ఉండాలి. ఆసుపత్రిలో పని చేసేందుకు సంసిద్ధత వ్యక్త చేస్తూ అనుమతి పత్రం ఉండాలి. కానీ ఇక్కడ శరత్ కార్డియాక్ సెంటర్‌లో అసలు డాక్టరే లేరు. ఒక టెక్నీషియన్ టెస్టులు చేస్తున్నాడు. యాపిల్ స్కాన్ సెంటర్‌లో ఎంబీబీఎస్ డాక్టర్‌కు రెన్యువల్ లేదు. మరో డాక్టర్‌కు తెలంగాణ కౌన్సిల్‌లో అనుమతి లేదు. శ్రీకృష్ణ ఆసుపత్రిలో అర్హత ఉన్న డాక్టర్ లేరు. ఈ శ్రీకృష్ణ ఆసుపత్రికి తెలంగాణ రిజిస్ట్రేషన్ కూడా లేదు. అల్ట్రా సౌండ్ సిస్టమ్‌కు ఏపీ ప్రభుత్వ వైద్యాధికారి పేరిట అనుమతులు ఉండగా, ఆయన ఆంధ్రాలోనే విధులు నిర్వర్తిస్తున్నారు. వీటన్నింటికి ఎలా అనుమతులు ఇచ్చారో తేలాల్సి ఉంది' అని తెలంగాణ మెడికల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ నరేశ్‌కుమార్ తెలిపారు. వీటిలో జిల్లా వైద్యాధికారి ఏమైనా అక్రమాలకు పాల్పడ్డారా అని మీడియా ప్రశ్నించగా, అనుమానించాల్సిందే కదా! అని చెప్పుకొచ్చారు.

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్

మరో కుంభమేళాగా బీఆర్ఎస్ రజతోత్సవ సభ

- ప్రజలు స్వచ్ఛందంగా తరలి వచ్చేందుకు సిద్ధం
- ఎప్పుడైనా బీఆర్ఎస్ ప్రజల కోసమే పని చేస్తుంది
- మాజీ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్

సూర్యాపేట టౌన్, ఏప్రిల్ 24 : దక్షిణ భారతదేశంలో మరో కుంభ మేళాగా తెలంగాణ రాష్ట్రంలో బీఆర్ఎస్ రజతోత్సవ సభ జరగనుందని మాజీ రాజ్యసభ సభ్యుడు, బీఆర్ఎస్ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు బడుగుల లింగయ్యయాదవ్ అన్నారు. సూర్యాపేట జిల్లా బీఆర్ఎస్ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ నెల 27న జరుగనున్న రజతోత్సవ సభలో కేసీఆర్ మాటల కోసం అన్ని వర్గాల ప్రజలు ఎదురు చూస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఏర్పడిందని, సాగునీళ్లు ఇవ్వకపోవడంతో పంటలు ఎండి పోయాయని, పండిన కొద్ది పంటను కొనక రైతులను ఇబ్బంది పెడుతున్నారని తెలిపారు. మళ్లీ కేసీఆర్ పాలనను జనం కోరుకుంటున్నారని చెప్పారు. నాడు 14 ఏండ్లు ఉద్యమం చేసినా, పదేండ్ల పాటు అధికారంలో ఉన్నా, 16నెలలుగా ప్రతిపక్షంలో ఉన్నా ప్రజల కోసంమే బీఆర్ఎస్ పని చేస్తుందని అన్నారు. కేసీఆర్ ఇన్నాళ్లు మౌనంగా ఉన్నారని, ఇప్పుడు సభలో ఏం చెబుతారో, ఏం భరోసా ఇస్తారోనని ప్రజలు ఎదురు చూస్తున్నారని తెలిపారు. సభకు సూర్యాపేట జిల్లా నుంచి ప్రజలు స్వచ్ఛందంగా వచ్చేందుకు సిద్ధమవుతున్నారని చెప్పారు. ఇప్పటికే అన్ని గ్రామాలు, వార్డుల్లో సమావేశాలు ఏర్పాటు చేసి బీఆర్ఎస్ పదేండ్లు చేసిన అభివృద్ధిని, 16 నెలల కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాన్ని వివరించామన్నారు. సభకు వెళ్లే రూట్ మ్యాప్, పార్కింగ్ వివరాలు త్వరలో విడుదల కానున్నాయని తెలిపారు.

మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి ఆధ్వర్యంలో వరంగల్ రజతోత్సవ సభకు బయల్దేరిన రైతుల ఎడ్లబండ్లకు గ్రామ గ్రామాన ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని చెప్పారు. కాంగ్రెస్ ప్రజా ప్రతినిధులు ప్రజల వద్దకు వస్తే ప్రజలు తిరగబడుతారని వారి వద్దకు రావడం లేదని, జిల్లాకు మంత్రిగా ఉన్న ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఇప్పటి వరకు ఒక్క సమీక్ష కూడా నిర్వహించలేదని, ప్రజలను, రైతులను పట్టించుకునే నాథుడే కరువయ్యాడని విమర్శించారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి వై.వెంకటేశ్వర్లు, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణశ్రీనివాస్, మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎంపీపీ నెమ్మాది భిక్షం, మాజీ జడ్పీటీసీ జీడి భిక్షం, నాయకులు బొమ్మగాని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆలేరులో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి

పండుగలా తరలిరావాలి

- వరంగల్ సభకు స్వచ్ఛందంగా వచ్చేందుకు ప్రజలు సిద్ధం
- ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి

ఆలేరు టౌన్, ఏప్రిల్ 24 : ఈ నెల 27న వరంగల్‌లో జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభకు ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని, ప్రతి గ్రామం నుంచి పండుగలా రావాలని ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి అన్నారు. ఆలేరు పట్టణ కేంద్రంలో గురువారం విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. పదేండ్ల పాలనలో కేసీఆర్ దేశానికే ఆదర్శంగా రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లారన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని మండిపడ్డారు. గ్రామీణ ప్రాంతాల్లో మళ్లీ కేసీఆర్ సారే రావాలని ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. ఆలేరు నియోజకవర్గం నుంచి 200 బస్సులు ఏర్పాటు చేసినట్లు, బీఆర్ఎస్ శ్రేణులు, రైతులు తరలిరావాలని కోరారు. వరంగల్ సభ ద్వారా రాష్ట్ర ప్రజలకు పలు అంశాలపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ దిశా నిర్దేశం చేస్తారని చెప్పారు. సమావేశంలో ఆలేరు మాజీ మున్సిపల్ చైర్మన్ వస్పరి శంకరయ్య, పట్టణ అధ్యక్షుడు పుట్ట మల్లేశం, మాజీ సర్పంచ్ ఏసిరెడ్డి మహేందర్‌రెడ్డి, కుండె సంపత్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.


సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే నోముల భగత్

గులాబీ జెండానే ప్రజలకు అండ

- సబ్బండ వర్గాలకు సంక్షేమ పథకాలను అందించిన ఘనత కేసీఆర్‌దే
- వరంగల్ సభకు పెద్ద ఎత్తున కదిలిరావాలి
- ఎమ్మెల్సీ కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే భగత్

నిడమనూరు, ఏప్రిల్ 24 : కేసీఆర్ త్యాగంతో ఏర్పడిన ప్రత్యేక రాష్ట్రంలో గులాబీ జెండానే ప్రజలకు అండ అని ఉమ్మడి జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ కుమార్ అన్నారు. నిడమనూరు మండల పరిధిలోని వేంపాడు స్టేజీ వద్ద గురువారం నిడమనూరు, మాడుగుల పల్లి మండలాల బీఆర్ఎస్ శ్రేణులతో నిర్వహించిన రజతోత్సవ సభ సన్నాహక సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్రంలో సబ్బండ వర్గాలకు సంక్షేమ పథకాలను అందించిన ఘనత కేసీఆర్ దేనన్నారు. బూటకపు మాటలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ హామీల అమలులో విఫలమైందని మండిపడ్డారు. నిరుపేదలు, సబ్బండ వర్గాల సంక్షేమానికి కట్టుబడిన కేసీఆర్ పాలనలో సుభిక్షంగా ఉన్న తెలంగాణ నేడు అభివృద్ధికి నోచుకోక అన్ని రంగాల్లో వెనుకబాటుకు గురైందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలను వంచించిన కాంగ్రెస్‌కు పరాభవం తప్పదన్నారు. గ్రామాల నుంచి ఈ నెల 27న ఉదయం 8 గంటలకు హాలియా పట్టణానికి ర్యాలీగా చేరుకుని వరంగల్ సభకు తరలివెళ్లాలని పిలుపునిచ్చారు. రజతోత్సవ సభ విజయవంతానికి సమన్వయంతో పనిచేయాలని బీఆర్ఎస్ శ్రేణులకు సూచించారు. సమావేశంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు తాటి సత్యపాల్, బొల్లం రవియాదవ్, పగిళ్ల సైదులు, చింత రెడ్డి యాదగిరి రెడ్డి, పెదమాం యాదయ్య, జంగిలి రాములు, బైరెడ్డి సత్యనారాయణ రెడ్డి, అన్నెబోయిన కొండల్, మెరుగు రామలింగయ్య, చిలుముల సంతోష్‌కుమార్, నల్లబోతు వెంకటేశ్వర్లు, కేశ శంకర్, అల్లం శ్రీనివాస్, పిల్లి రమేశ్, శంకరయ్య, మారయ్య తదితరులున్నారు.

రైతులకు ఆధార్ తరహా కార్డులు

- రైతులు, భూముల వివరాలు నిక్షిప్తం
- వ్యవసాయ పథకాల అమలుకు అనుసంధానం
- త్వరలో జిల్లాలో ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియ
- వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాట్లు

యాదాద్రి భువనగిరి, ఏప్రిల్ 24 (నమస్తే తెలంగాణ) : రైతులందరికీ ఆధార్ కార్డు తరహా ప్రత్యేక కార్డులు అందనున్నాయి. పథకాల అమలు కోసం 11 అంకెల యూనిక్ ఐడీతో కార్డులు జారీ చేయనున్నారు. అందుకు సంబంధించి యాదాద్రి భువనగిరి జిల్లాలో ఫార్మర్ రిజిస్ట్రీ కార్యక్రమానికి త్వరలో శ్రీకారం చుట్టేందుకు వ్యవసాయ శాఖ సన్నద్ధమవుతున్నది.

రైతులకు ప్రభుత్వ పథకాలు సక్రమంగా అందేందుకు ఆధార్ తరహాలో 11 నెంబర్ల గుర్తింపు సంఖ్యతో ప్రత్యేక కార్డులను జారీ చేయాలని కేంద్రం నిర్ణయించింది. ఆ కార్డులను వ్యవసాయ పథకాలకు అనుసంధానం చేయనుంది. ఆధార్‌తో దేశంలోని ప్రతి పౌరుడికి గుర్తింపు ఇచ్చినట్లుగానే ప్రతి రైతుకు 11నంబర్లతో సంఖ్యను కేటాయించి వ్యవసాయ రంగాన్ని డిజిటలైజేషన్ చేయాలని భావిస్తున్నది. ప్రతి రైతు, భూమి వివరాలతో ఫార్మర్ రిజిస్ట్రీ జరుగుతుంది. రెవెన్యూ శాఖ ద్వారా సేకరించిన భూ యాజమాన్య వివరాలను, రైతు ఆధార్ నంబర్‌ను అనుసంధానం చేసి ఫార్మర్ ఐడీని కేటాయిస్తారు. ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు ఏ రకమైన చట్టబద్ధ యాజమాన్య హక్కునూ కల్పించదు.

ప్రయోజనాలు ఇలా..

కేంద్ర పథకాల అమలుకు ఫార్మర్ రిజిస్ట్రీని అనుసంధానం చేస్తారు. తద్వారా రైతుల పంటలు, వారి వద్ద ఉన్న పశు సంపద తదితర సమాచారమంతా కేంద్రం దగ్గర ఉంటుంది. పీఏం కిసాన్ లబ్ధిదారులకు తదుపరి విడుత లబ్ధి పొందేందుకు ప్రామాణికంగా ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు తప్పనిసరి

చేస్తూ ఇటీవల మార్గదర్శకాలు కూడా జారీ అయ్యాయి. ప్రస్తుతానికి రాష్ట్ర పథకాలు అయిన రైతు భరోసా, రుణమాఫీ స్కీమ్‌లకు ఫార్మర్ రిజిస్ట్రీకి సంబంధం లేదు. భవిష్యత్‌లో ఇదే ప్రామాణికంగా తీసుకునే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. ఈ ఐడీని ఉపయోగించి కిసాన్ క్రెడిట్ కార్డు ద్వారా బ్యాంక్ లింకేజీతో కూడిన ఆర్థిక సేవలు పొందే అవకాశం కూడా ఉందంటున్నారు. దీని సాయంతో రుణ అర్హత, బకాయిలు, ప్రభుత్వ పథకాల జమ తదితర వివరాలను క్షణాల్లో తెలుసుకునే వెసులుబాటు ఉంటుంది.

త్వరలో రిజిస్ట్రేషన్ ప్రక్రియ..

యాదాద్రి భువనగిరి జిల్లాలో 2.30 లక్షల మంది రైతులు ఉన్నారు. రైతు విశిష్ట సంఖ్యను పొందేందుకు ఆధార్, భూ యాజమాన్య పాస్ పుస్తకం, ఆధార్‌కు లింక్ చేసిన మొబైల్ నెంబరుతో సమీపంలోని వ్యవసాయ అధికారి లేదా వ్యవసాయ విస్తరణ అధికారిని సంప్రదించి ఫార్మర్ ఐడీకి రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. ఈ ప్రక్రియ తేదీలను త్వరలో ప్రకటించనున్నట్లు వ్యవసాయ అధికారులు చెప్తున్నారు.

రజతోత్సవ సభ పోస్టర్ ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే కిశోర్‌కుమార్, బీఆర్ఎస్ నాయకులు

బీఆర్ఎస్ రజతోత్సవాన్ని విజయవంతం చేయాలి

- తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే కిశోర్‌కుమార్

తిరుమలగిరి, ఏప్రిల్ 24 : వరంగల్‌లో ఈ నెల 27న జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభకు తుంగతుర్తి నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ శ్రేణులు, అభిమానులు, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ అన్నారు. తిరుమలగిరి మండలంలోని తాటిపాముల గ్రామానికి చెందిన బీఆర్ఎస్ యూత్ జిల్లా నాయకుడు దయా యాదవ్ ఆధ్వర్యంలో గురువారం మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్‌ను హైదరాబాద్‌లోని తన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా కిశోర్ రజతోత్సవ సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ప్రతి గ్రామం నుంచి కనీవిని ఎరుగని రీతిలో సభకు వచ్చి విజయవంతం చేయాలని కోరారు. బీఆర్ఎస్ నాయకులు కోల మలకయ్య, తొర్పునూరి హరీశ్, పెరుమాండ్ల పురుషోత్తం, దాసగాని ఉదయ్, బందెల మోహన్, నాగన్న, ప్రవీణ్, అశోక్, లాజర్ శాంతి, శోభన్‌బాబు, సురేశ్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి

వరంగల్ సభకు దండుగా తరలి రావాలి

- ప్రజలు కేసీఆర్ నాయకత్వాన్ని కోరుకుంటున్నారు
- చరిత్రలో నిలిచి పోయేలా ఎల్కతుర్తి సభ
- డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్ రెడ్డి

రాజాపేట, ఏప్రిల్ 24 : వరంగల్ ఎల్కతుర్తిలో జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభ కుంభమేళను తలపించి చరిత్రలో నిలిచిపోనుందని, సభకు దండులా కదలి రావాలని డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన హాజరై మాట్లాడుతూ కాంగ్రెస్ 15 నెలల పాలనపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత నెలకొందని, రేవంత్ రెడ్డి అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలతో ప్రజల్లో అభాసుపాలవుతున్నాడని విమర్శించారు. వానకాలం రైతు బంధు ఎగ్గొట్టి రైతులకు మాయమాటలు చెప్తూ మోసం చేస్తున్నాడని ఆరోపించారు. ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలు ఊసే లేదని, కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు 2500, కల్యాణ లక్ష్మి, రైతు భరోసా, రుణమాఫీ అందించడంలో పూర్తిగా విఫలం చెందిందని దుయ్యబట్టారు. ప్రజా పాలన అని చెప్పి నిర్బంధ పాలన సాగిస్తున్నారని మండిపడ్డారు. పోలీసులు అరాచకాలు సృష్టిస్తూ అధికార పార్టీకి ఏజెంట్లుగా మారిపోయారని విమర్శించారు. పోలీస్ స్టేషన్లు కాంగ్రెస్ పార్టీ కార్యాలయాలుగా మారిపోయాయని, బీఆర్ఎస్ పార్టీ నాయకులపై కేసులు నమోదు చేసి భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. యాదగిరిగుట్ట ఏసీపీ స్థానిక ఎమ్మెల్యేకు గన్‌మెన్‌గా వ్యవహరిస్తున్నారని, రాజ్యాంగ బద్ధంగా నడుచుకోవాలని హితవు పలికారు. ప్రజలు కేసీఆర్ నాయకత్వాన్ని కోరుకుంటున్నారని, రజతోత్సవ సభలో ఏం మాట్లాడతారోనని ఆసక్తిగా ఎదురు చూస్తున్నారన్నారు. ప్రజలు స్వచ్ఛందంగా తరలి రావడానికి సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు సట్టు తిరుమలేశ్, మాజీ జడ్పీటీసీ చామకూర గోపాల్ గౌడ్, నాయకులు గుంటి కృష్ణ, సంధిల భాస్కర్ గౌడ్, రామిండ్ల నరేందర్, బెడద వీరేశం, కటకం స్వామి, ఠాకూర్ ధర్మేందర్ సింగ్, రాంరెడ్డి చెరుకు కనకయ్య, ఉప్పలయ్య గౌడ్, లక్ష్మణ్ నాయక్, ఉప్పలయ్య, అశోక్, పాండరి ఉన్నారు.

వలిగొండలో చరితార్థుడు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నందిని సిధారెడ్డి తదితరులు

ఆదర్శప్రాయుడు కూరెళ్ల

- నందిని సిధారెడ్డి

వలిగొండ, ఏప్రిల్24 : కవిగా, రచయితగా గుర్తింపు పొందిన పద్మశ్రీ డాక్టర్ కూరెళ్ల విఠలాచార్య ఆదర్శప్రాయుడని తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ నందిని సిధారెడ్డి అన్నారు. వలిగొండ పట్టణ కేంద్రానికి చెందిన వర్ధమాన కవి, రచయిత రెబ్బ మల్లికార్జున్ పద్మశ్రీ కూరెళ్ల విఠలాచార్య జీవిత చరిత్రపై రాసిన 'చరితార్థుడు' పుస్తకాన్ని గురువారం వలిగొండ మండల కేంద్రంలోని స్వర్ణకారుల భవనంలో ఆవిష్కరించారు. దీనికి ముఖ్య అతిథిగా నందిని సిధారెడ్డితోపాటు పలువురు ప్రముఖులు హాజరయ్యారు. కూరెళ్ల విఠలాచార్యను స్ఫూర్తిగా తీసుకోవాలని, గ్రంథాలయం ఏర్పాటుతో వివిధ కార్యక్రమాల ద్వారా ఆయన చేస్తున్న సేవలు ఎనలేనివని అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ తూర్పు మల్లారెడ్డి, జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు డాక్టర్ పోరెడ్డి రంగయ్య, బండారు జయశ్రీ, వాకిటి రాంరెడ్డి, బోగోజు గోవర్ధన్, అరవిందరాయుడు, ఎస్ఎన్ చారి, సాహిత్య అభిమానులు పాల్గొన్నారు.

రైతులు లేని రైతు సదస్సు

- మోత్కూరులో మొక్కుబడిగా భూ భారతి చట్టంపై అవగాహన
- రైతులు రాకపోవడంతో తాసీల్దార్‌పై కలెక్టర్ ఆగ్రహం

మోత్కూరు, ఏప్రిల్24: భూ భారతి చట్టంపై మోత్కూరులో గురువారం అధికారులు నిర్వహించిన అవగాహన సదస్సుకు రైతులు లేక వెలవెల పోయింది. ఎమ్మెల్యే సామేల్‌తోపాటు కలెక్టర్ హనుమంతరావు సదస్సుకు హాజరయ్యారు. మండల రైతులు లేకుండానే అధికారులు అవగాహన సదస్సును మొక్కుబడిగా నిర్వహించారు. అవగాహన సదస్సుకు రైతులను పిలువలేకపోయినప్పుడు ఈ సదస్సులు ఎందుకు, తమను ఎందుకు పిలిచావంటూ కలెక్టర్ హనుమంతరావు మండల ఇన్‌చార్జి తాసీల్దార్ ఉపేందర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల ఇన్‌చార్జి తాసీల్దార్ ఉపేందర్ మండల వ్యవసాయ, ఇతర శాఖల అధికారులను సమన్వయం చేసుకోకపోవడం వల్ల గ్రామాల్లోని రైత